క్లుప్తంగా

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

కోటపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, అధికారంలోకి వస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ పీసీసీ సభ్యులు నూకల రమేశ్ అన్నారు. పార్‌పల్లి గ్రామంలో ఆదివారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తూ అధికా రంలోకి వస్తే చేపట్టే పథకాలను గ్రామస్తులతో చర్చించారు. ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. నిరుద్యోగ భృతితో పాటు గ్యాస్ సిలిండర్ ధర రూ.500 చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్ ప్రసాద్, నాయకులు సంపత్, సుఖేందర్, తిరుపతి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 ఎన్నికల ప్రచారంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే సింగరేణి సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని కేసీఆర్ ప్రచార సభల్లో హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటికి ఏ ఒక్కరినీ పర్మినెంట్ చేయలేదన్నారు. ముఖ్యమంత్రి ఈ నెల 9న సింగరేణి ప్రాంతానికి వస్తున్నందునా, తాను ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసేలా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టణ కమిటీల ఎన్నిక

పాతమంచిర్యాల: జాతీయ మాల మహానాడు పట్టణ కమిటీని జిల్లా మాలమహానాడు పట్టణ కమిటీ అధ్యక్షుడు గజెల్లి రాజమల్లు జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రకటించారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఐత రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా రేవెళ్లి సతీష్, కొప్పుల తిరుపతి, కోశాధికారిగా మాను ప్రకాష్, కార్యదర్శిగా ఇసారపు రాజమౌళి, ప్రచార కార్యదర్శిగా కోడిగూటి అరుణ్‌కుమార్, సహాయక కార్యదర్శులుగా పత్తి రాములు, వేముల అశోక్, దుంద్ర రాజశేఖర్, రేళ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో శంకర్, సుధీర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో పద్మశాలీ సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఎన్నికల్లో నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలీ సంఘం చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా పేరాల సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా గుండెటి మధు, ప్రధాన కార్యదర్శిగా వెంగళ ఉదయ్, కోశాధికారిగా చెడె తిరుపతి, సంయుక్త కార్యదర్శులుగా మోతె దామోదర్, పుల్లె రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నం చిన్న బానయ్య, వొల్లల సుదర్శన్, బండారి శ్రీనివాస్, కుడికాల సమ్మన్న, మోతె శ్రీనివాస్, నాగన్న, చెడె అశోక్, రాకేశ్ ఎన్నికయ్యారు.

ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలను తనఖీ చేసి, విరుద్ధంగా నడిపించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

మంచిర్యాలఅర్బన్: గోదావరినది తీరాన గౌతమేశ్వర ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయస్వామి వ్రతాలు నిర్వహించారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో 11జంటలు పాల్గొన్నాయి. మర్రి చెట్టు వద్ద వటసావిత్రి పూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ప్రవీన్, కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి మహేష్, రీజియన్ చైర్మన్ కొంకుముట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పట్టింపేది..?


డంప్‌యార్డులో మంటలతో వ్యాప్తి చెందుతున్న పొగ

ప్రజారోగ్యంపై మున్సిపల్ పాలకులు, అధికారులు శ్రద్ధ వహించడం లేదు. పురప్రజల అనారోగ్య సమస్యలకు కారణమయ్యే ప్రతికూల పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్న పందుల మృత్యువాత, వాయుకాలుష్యం, పొగ, డంప్‌యార్డు సమస్యలను చక్కదిద్దే చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కబెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఓట్లతో గెలిచిన మున్సిపల్ పాలకులు చేష్టలుడిగి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలను మూటగట్టుకుంటున్నారు.

- బెల్లంపల్లి మున్సిపాలిటీలో తీవ్ర వాయు కాలుష్యం
- రోజుల తరబడి డంపింగ్ యార్డు నుంచి పొగ
- ఎక్కడికక్కడ మృతి చెందిన పందుల కళేబరాలు
- వ్యాధుల వ్యాప్తిపై ఆందోళన

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో గడిచిన మూడు నెలల నుంచి పందులు మృతి చెందుతున్నాయి. బస్తీల వారీగా ఎక్కడికక్కడ చనిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. జన నివాసాల్లో మృత్యువాత పడుతుండగా, వీటిని ఎప్పటికప్పుడు ఖననం చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా పురప్రజలు విమర్శిస్తున్నారు. చనిపోయిన పందులు రెండు, మూడు రోజుల పాటు స్థిరంగా అక్కడనే ఉంటుండటంతో, వాటి కళేబరాలను కుక్కలు పీక్కుతింటున్నాయి. మృతి చెందిన పందుల మాంసాన్ని ఇళ్ల పరిసరాల్లోకి తీసుకువచ్చి వేస్తున్నాయి. వీటి వల్ల ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయనే భయాందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. బస్తీవాసుల నుంచి ఒత్తిళ్లు, సమస్యలు వస్తుండటంతో కొంతమంది మున్సిపల్ కౌన్సిలర్లు సానుకూలంగా స్పందిస్తున్నా, మెజార్టీ సభ్యులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు కౌన్సిలర్లు తప్పా మున్సిపల్ పాలకులు, అధికారులు పందుల వ్యవహారంపై దృష్టిసారించిన పాపాన పోలేదని పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సమస్య రోజురోజుకు జఠిలంగా తయారవుతున్నా, ఉలుకుపలుకు లేకుండా వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది.

చర్యలు తీసుకుంటాం



డంప్‌యార్డు, పొగ వల్ల కలుగుతున్న ఇబ్బందులను నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికైతే డంప్‌యార్డు నుంచి పొగ వ్యాపించకుండా తక్షణ చర్యలు తీసుకుంటాం. కొత్తగా డంప్‌యార్డును ఎక్కడ ఏర్పాటు చేయాలో అన్ని రకాల ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటాం. పందుల మృతి సమస్య దృష్టికి వచ్చింది. ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమాలోచనలు చేస్తున్నాం. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి తోడ్పడుతాం. – కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

కొలిక్కిరాని డంపింగ్ యార్డు సమస్య..

కొత్తబస్టాండ్ ఏరియా ప్రాంతంలో తీవ్రమైన వాయుకాలుష్యం ప్రబలుతోంది. ఎత్తివేతకు గురైన డంప్ యార్డులో మంటలు వ్యాపించి చీకటి కాగానే దట్టమైన పొగలు వ్యాపిస్తున్నాయి. ఐదు రోజుల నుంచి వరుసగా ఇళ్లల్లో పొగజూరి అనేక బస్తీల ప్రజలు ఊరిరాడక సతమతమవుతున్నారు. పాలకవర్గ సభ్యులు ఆ సమస్యను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. శనివారం ఏకంగా పలు బస్తీల ప్రజలు కొత్తబస్టాండ్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేయడం పొగ సమస్య ఎంత ఇబ్బందికరంగా మారిందో ఊహించుకోవచ్చు. శాంతిఖని బస్తీ శివారు ప్రాంతంలో పదెకరాల ప్రభుత్వ భూమిని డంప్‌యార్డు కోసం ఈపాటికే గుర్తించినా, ఇప్పటివరకు అక్కడ పనులు ప్రారంభం కాలేదు. కాగా ఆ ప్రాంత ప్రజలు డంప్‌యార్డు ఏర్పాటు చేయకుండా ఆందోళనలు కూడా చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపై లారీ.. నిలిచిన రాకపోకలు





భీమారం: భీమారం-ఆరెపల్లి ప్రధాన రహదారిలో మూడు నెలల క్రితం ఆరెపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మిషన్‌భగీరథ పైపులైన్ కోసం బీటీ రోడ్డును తవ్విన అధికారులు, సక్రమంగా పూడ్చకపోవడంతో గుంత ఏర్పడింది. ఆ గుంతపై నుంచి 700ధాన్యం బస్తాలతో ఆదివారం లారీ వెళ్లగా మట్టిలో కూరుకుపోయింది. దీంతో ఆ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రంగుమారిన 'భగీరథ'



నెన్నెల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న శుద్ధ జలం ఇంటింటికీ చేరే సరికి 'గరళం'గా మారుతుంది. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగడానికి వీలు లేకుండా, మురికిగా రావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంకులను సంవత్సరాల నుంచి శుభ్రం చేయకపోవడం, లీకేజీలకు మరమ్మతు లేక నీరు కలుషితమవుతుంది. ప్రజలు రోగా ల బారిన పడకుండా అధికారులు అప్రమత్తమై వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, లీకేజీలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

మందమర్రిరూరల్/చెన్నూర్/జైపూర్: నిర్మల్‌లో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు చెన్నూర్ నియోజకవర్గం నుంచి పలు మండలాలు, పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. చెన్నూర్ నుంచి ఎంపీపీ మంత్రిబాపు, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు వేల్పుల సుధాకర్, జగన్నాథుల శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు వెళ్లగా, మందమర్రి నుంచి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఇన్‌చార్జి శ్రీనివాస్ నాయకులు తిరుపతిరెడ్డి, సూరిబాబు, సంపత్, రవీందర్, శంకర్, వేణు, స్వామి, ఈశ్వర్, రాజ్‌కుమార్ వెళ్లారు. జైపూర్ నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.


చెన్నూర్ నుంచి సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

'హామీలు నెరవేర్చని సీఎం మాకొద్దు'

మందమర్రిరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చని ముఖ్యమంత్రి మాకొద్దని వైఎస్సార్‌టీపీ చెన్నూర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దుర్గం నాగేష్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహిస్తామని, చెన్నూర్ రెవెన్యూ డివిజన్, కొత్త మండలాలు ఏర్పాటు చేస్తామని, నూతన బొగ్గు గనులకు అనుమతులు తీసుకొస్తానని సీఎం తదితర హామీలు ఇచ్చి మరిచారని తెలిపారు. హామీలు నెరవేర్చేవరకు జిల్లాలో అడుగుపెట్టొద్దన్నారు. ఆయన వెంట నాయకులు అజీమొద్దీన్, రాజేంద్రప్రసాద్, ప్రభుదేవ్, కవిరాజ్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం





బెల్లంపల్లి: స్థానిక వాణినికేతన్ పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక సింగరేణి కళావేదికలో కలిశారు. పదో తరగతి చదివి 20వసంతాలు గడిచిన తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారు, ఏం చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల గురువులు రాజ్‌మహ్మద్, శంకర్, సురేష్, భానేష్, నగేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: స్థానిక సందీపని హైస్కూల్లో 2001-2002లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే స్కూల్లో కలుసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారిరువురిని సన్మానించారు. 21ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు నాటి తరగతి గదిలో తీపి జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. డ్యాన్సులు చేస్తూ, పాటలు పాడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, పూర్వ విద్యార్థులు చుక్క రాజు, మూగల మహేష్, శ్రీనివాస్, జ్యోతి, విజయ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్/శ్రీరాంపూర్: ఈ నెల 9వ తేదీన సీఎం కేసీఆర్ మంచిర్యాలకు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల 8వ వార్డులో ఆదివారం వార్డు బీఆర్ఎస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు కార్మికవాడలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బహిరంగ సభకు కార్మిక వర్గం, కార్మికేతరులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమాల్లో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కార్మికులు, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మా బడిలో చేర్పించండి!


భీమారం: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భీమారం/భీమిని: భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో, భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన తీరుపై, అంగన్‌వాడీల్లో చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పించాలని కోరారు. భీమారంలో సర్పంచ్ గద్దె రాంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, శ్రీమూర్తి, వార్డుమెంబర్లు పాల్గొనగా, భీమినిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

'రైళ్లు ఆపాలని దీక్ష'

మందమర్రిరూరల్: మందమర్రి రైల్వేస్టేషన్‌లో సింగరేణి, అజిని, రామగిరి ప్యాసింజర్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని డిమాండ్ చేస్తూ టీడీపీ చెన్నూర్ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఆదివారం ఒకరోజు దీక్ష చేపట్టారు. దీక్షకు కాంగ్రెస్, బీజేపీ, ఏఐఎఫ్‌బీ, జనసేన, తదితర పార్టీల, కుల సంఘాల నాయకులు వచ్చి సంఘీభావం ప్రకటించారు.

తెగిపడిన విద్యుత్ లైన్

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారి సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ తెగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తెగిపడిన లైన్ మంచిర్యాల నుంచి జైపూర్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. అనంతరం మరమ్మతు చేపట్టారు.

ఎమ్మెల్యే చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ భాగస్వామి శేజల్‌ను లైంగికంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్య తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏసీపీ కార్యాలయంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చిన్నయ్యపై శేజల్ కొద్ది నెలల నుంచి ఆరోపణలు చేస్తున్నారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని కోరారు. బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్, విజయ్, నరేశ్, రేవెల్లి రాజలింగు, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

బెల్లంపల్లి: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్, శాంతిఖని గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. బెల్లంపల్లిలోని టీసీవోఏ క్లబ్‌లో పేరాల రాజయ్య జ్ఞాపకార్థం సీనియర్, జూనియర్ విభాగాల్లో జిల్లాస్థాయి చెస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. చెస్ ఆటతో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. జిల్లాస్థాయిలో గెలిచిన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు కుమురంభీం జిల్లా గోలేటి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోటీల్లో సీనియర్ విభాగంలో ఎ.అజయ్ విజేతగా, రామకృష్ణ రన్నర్‌గా మూడోస్థానంలో సుధాకర్ నిలిచారు. జూనియర్ విభాగంలో విజేతగా రామానంద్‌గౌడ్ నిలిచాడు. కార్యక్రమం ఉమ్మడి ఆదిలాబాద్ చెస్ క్రీడా అభివృద్ధి చైర్మన్ కనకయ్య, టోర్నమెంట్ కోకన్వీనర్ పేరాల రాజమల్లు, నిర్వాహకులు సుధాకర్, ఉపేందర్, రవీందర్, రవి, సమ్మయ్య, సైదులు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

పాతమంచిర్యాల: విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని మితఅయ్యల్వార్ కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఆదివారం మితఅయ్యల్వార్ కమ్యూనిటీకి చెందిన ఇంటర్, టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన 15మంది విద్యార్థులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాత్పడి విజయ్, ఉపాధ్యక్షుడు గడ్డల మధుసూధన్, కోశాధికారి మార్కాపురి రమేష్, గౌరవ అధ్యక్షుడు దర్మపురి నర్సయ్య, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మహిళా కార్యదర్శి హేమలత, సాంస్కృతిక మహిళా కార్యదర్శి స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సంఘం నాయకులు

'సురక్షా దినోత్సవం ఎందుకో?'

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ఎవరికి న్యాయం చేశారని సురక్షా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని బీజేవైఎం నాయకులు పల్లి రాకేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. ప్రతి గ్రామం, వార్డుల్లో బెల్టుషాపులను నెలకొల్పి, యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా చలామని అవుతున్నా, వాటిని అరికట్టడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులపై, అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వాటికి భయపడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి హరికృష్ణ, రాకేశ్ రెన్వా, వంశీ, మనీశ్, తరుణ్, విష్ణు, అభిషేక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

అన్నదానం

మంచిర్యాలటౌన్: వాసవిక్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసి, జిల్లా కేంద్రంలో అన్నదానం చేపట్టారు. రైల్వే స్టేషన్ ఎదుట గడ్డం ఉషాకళ్యాణి-సూర్యప్రకాశ్ సహకారంతో 500మంది నిరుపేదలకు అన్నదానం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్: క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899